క్లుప్తంగా

షెడ్డులోకి దూసుకెళ్లిన లారీ



చెరుకుపల్లి: లారీ అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న షెడ్డులోకి దూసుకెళ్లిన ఘటన గురువారం మండలంలోని ఆరుంబాక గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు రేపల్లె నుంచి బాపట్ల వైపు వెళ్తున్న ఓ సీఫుడ్స్ లారీ డ్రైవర్ నిద్ర మత్తులో వాహనాన్ని నడుపుతుండటతో ఆరుంబాక సమీపంలో హైవే పక్కనే ఉన్న రేకుల షెడ్డు వైపు దూసుకెళ్లింది. ఆ సమయంలో షెడ్డులో ఎవరూ లేకపోవటంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

విద్యార్థులకు కిట్స్ అందజేత



పేరలి(కర్లపాలెం): ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు తెలిపారు. పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకుని విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, నేత్ర వైద్యులు బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల అభ్యున్నతికి తమ ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తున్నామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్ : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్ పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదా కాలనీ 14వ లైనులో నివాసం ఉండే ఏల్చూరి ఏసు (30) ఆర్థిక సమస్యల కారణంగా ఈ నెల 8న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

చేబ్రోలు: పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావుకు గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టెండర్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయటం సరికాదన్నారు. బలవంతపు సంతకాలు పెట్టించటం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించటం సరికాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివమ్మ, శారద, శ్రీను, హనుమంతురావు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో అనర్థాలు


లక్ష్మీపురం: జనాభా పెరుగుదల వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం 'జనాభా నియంత్రణ – ప్రజలు – ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న జనాభా వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. జనాభా పెరుగుదలకు సంబంధించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్యసమితి 1989లో దీనిని ప్రారంభించిందన్నారు. విద్యావేత్త ఎస్.రవిబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమాజాన్ని చైతన్య పర్చాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఎం.వినీత, కో–ఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఒక్కరికే పథకం

- పేదల ఆశలపై నీళ్లు జల్లిన కూటమి ప్రభుత్వం
- తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని నాడు ప్రకటించిన చంద్రబాబు
- తీరా అధికారంలోకి వచ్చాక మడమ తిప్పిన వైనం
- కుటుంబంలో ఒక్కరికే ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటన
- ప్రభుత్వ ప్రకటనతో పేద వర్గాల్లో అలముకున్న నైరాశ్యం
- ఇచ్చిన మాట తప్పటం చంద్రబాబుకు కొత్త కాదని సర్వత్రా విమర్శలు



టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ

భట్టిప్రోలు/రేపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వం మాట తప్పింది. తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట ప్రతి పేద విద్యార్థి చదువుకు రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తామని నాడు ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పేదలకు హామీ ఇచ్చారు. కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలున్నా వారందరికీ ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం తన సూపర్‌సిక్స్ మేనిఫెస్టోలో సైతం ఈ హామీని చేర్చింది. ఈ పథకానికి ఆకర్షితులైన పేదలు కూటమి ప్రభుత్వానికి మద్దతు పలికారు. తీరా తల్లికి వందనం పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని ప్రభుత్వం వెలువరించిన తాజా జీవోతో తామంతా మోసపోయామని తెలుసుకుని విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఇచ్చిన వాగ్దానాలను విస్మరించటం, నమ్మించి మోసం చేయటం చంద్రబాబుకు కొత్తేమీ కాదని గతంలో ఎన్నో సందర్భాల్లో ఆయన పథకాల పేరిట పేద ప్రజలను మోసం చేశారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

చెప్పేది ఒకటి చేసేది మరొకటి..



ఎన్నికలకు ముందు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ వర్తిస్తుందని చంద్రబాబు చెప్పారు. తీరా అందలం ఎక్కాక మాట మార్చి కుటుంబంలో ఒకరికే ఇస్తామని చెప్పడం ఎంతవరకు సబబు. చెప్పేది ఒకటి చేసేది ఒకటిలా ఉంది. ఆదిలోనే ఇలాంటి పరిస్థితి ఎదురైతే మున్ముందు మిగిలిన పథకాలు అమలు ఎలా ఉంటుందో దేవుడికే తెలియాలి.

–మాచర్ల దేవి, ఐలవరం, భట్టిప్రోలు.

ఏరుదాటాక తెప్పతగలేయడం అంటే ఇదే..



అధికారంలోకి వచ్చేవరకు వరకు ఒక మాట చెప్పి అందలం ఎక్కాక మాట మార్చడం చంద్రబాబుకే చెల్లింది. ఏరుదాటాక తెప్పతగలేయడం అంటే ఇదే. ఇప్పటికే తలకు మించిన భారం ఐనప్పటికీ మా పిల్లలను ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్పించాము. మా ఇద్దరి పిల్లలకు రూ.30 వేలు వస్తాయని అనుకుంటే ఒక్కరికే వర్తిస్తుందని ప్రభుత్వం జీవో జారీ చేసింది. మా ఆశలను ప్రభుత్వం ఆవిరి చేసింది.

–మాచర్ల రజని, ఐలవరం,భట్టిప్రోలు.

ఆశగా ఎదురుచూస్తున్నాం..



మాకు ఇద్దరు చిన్నారులున్నారు. పట్టణంలోని ప్రైవేటు స్కూలులో విద్యను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ఆరంభంలోనే అమ్మ ఒడి పథకం ద్వారా అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నగదును నేరుగా మా బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారు. వాటితో పిల్లల చదువులకు ఎంతో కొంత ఉపయోగపడేది. ఎన్నికలకు ముందు అమ్మకు వందనం పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా తమ ఇద్దరు పిల్లలకు పథకం వస్తుందని ఎదురు చూస్తున్నాం. ఇప్పటి వరకు విధి విధానాలు రూపొందించకపోవటం తగదు.

– బట్టు జ్యోతి, పేటేరు

అక్రమ విద్యుత్ వినియోగిస్తే చర్యలు

తెనాలి విద్యుత్‌శాఖ డీఈఈ చిరంజీవి

వేమూరు: ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వీవీ చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు మండలంలో విద్యుత్ సర్వీసులు గురువారం తనిఖీ చేశామన్నారు. 130 మంది సిబ్బంది 5,709 సర్వీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 177 మంది వినియోగదారులు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి వారి నుంచి జరీమానా వసూలు చేయటం జరిగిందన్నారు. అక్రమ విద్యుత్ వినియోగదారులను గుర్తించి వారికి రూ.8 లక్షలు జరీమానా విధించడం జరిగిందన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మికంగా విద్యుత్ వినియోగదారుల సర్వీసులను తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వ అనుమతితో మాత్రమే విద్యుత్ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కెవిఎల్ యస్ మూర్తి, కె రాజశేఖర్, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీరు గోపి తదితరులు పాల్గొనాన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న డీఈఈ చిరంజీవి

గర్భకోశ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తెనాలి: సంతోషకరమైన శుభకరమైన రోజును ఏదొక సేవతో గడపటం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెనాలి శాఖ కార్యదర్శి, హ్యాపీ హాస్పటల్, తెనాలి నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక అన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, చిత్రా రవిచంద్రన్ దంపతుల వివాహ వార్షికోత్సవం రోజైన గురువారం ప్రపంచవాప్తంగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. అందులో భాగంగా వాసవీ క్లబ్ వనిత ఆంధ్రాప్యారిస్ తెనాలి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పటల్‌లో గర్భాశయ క్యాన్సర్ నిరోధంపై అవగాహన సదస్సు జరిపారు. డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను, ప్రాథమికంగా గుర్తించటం, నివారణ వ్యాక్సిన్ వంటి అంశాలను వివరించారు. క్లబ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి లీలారాణి, కార్యదర్శి గొల్లపూడి అనూరాధ, కోశాధికారి వక్కలగడ్డ విజయలక్ష్మి, ఐఈసీ ఆఫీసర్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి, కొత్తమాసు పద్మావతి, అమరా కళ్యాణి, సుగ్గుల లక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పావనీ ప్రియాంకను సత్కరించారు.



డాక్టర్ పావనీ ప్రియాంకను సత్కరించిన క్లబ్ బాధ్యులు

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పాత గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్ కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోని మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎన్‌టీఏ ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను సంఘాల దృష్టికి తీసుకువస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మంగళదాస్ నగర్, వినోభా నగర్, వాసవీ నగర్, ఎల్‌బీ నగర్, పాత గుంటూరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.అంతోనిబాబు, అసోసియేట్ అధ్యక్షుడు వి.సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు వి. సాయి విశ్వనాథ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎన్‌టీఏ సభ్యులు

జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతోందని హిందూ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు జె. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సదస్సును బ్రాడీ పేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.బోసు బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1997 నుంచి ప్రపంచ జనాభా లెక్కింపు ప్రారంభించబడిందని, జనాభా పెరుగుదల కారణంగా ప్రభావితమవుతున్న వివిధ రంగాలు, వనరుల గురించి వివరించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. సదస్సులో యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఏఎస్ ప్రోగ్రాం అధికారి వి. వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అధ్యాపకుడు వెంకటేశ్వరరావు

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



కంచర్ల రాహుల్ (నూజివీడు)



గొరిగపూడి కీర్తన (ఒంగోలు)



తెనాలి స్టీవెన్‌పాల్ (ఒంగోలు)

పెసర్లంక(భట్టిప్రోలు): ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ) ఫలితాల్లో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన కంచర్ల రాహుల్ (నూజివీడు), గొరిగపూడి కీర్తన, తెనాలి స్టీవెన్ పాల్ (ఒంగోలు)లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మహబూబ్ భాషా గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, పెసర్లంక, పెదలంక, చింతమోటు సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, వేములపల్లి శ్రీరంజని, గుమ్మడి శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

తెనాలి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయటం మనందరి బాధ్యతగా ఉపాధ్యాయ ప్రముఖుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. పట్టణ చెంచుపేటకు చెందిన ఉపాధ్యాయ ఉద్యమనేత వైఎల్ నారాయణ–మీనా కుమారి దంపతుల కుమారుడు కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిని గురువారం అదే ప్రాంతంలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ విజయప్రసాద్ జీవిత విశేషాలను తెలియజేశారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను డాక్టరు, ఇంజినీరు చేయాలని చూస్తున్న రోజుల్లో వైఎల్ నారాయణ, మీనాకుమారి దంపతులు తమ కుమారుడు విజయప్రసాద్‌ను కోరుకొండ సైనిక్‌స్కూలుకు పంపినట్టు తెలిపారు. 12వ తరగతి వరకు అక్కడ చదివాక హిమాచల్‌ప్రదేశ్‌లోని మిలటరీ క్యాంపులో చేరి, అనతికాలంలో పారా కమాండర్ అయ్యారని చెప్పారు. 1987లో మన దేశం నుంచి శ్రీలంక వెళ్లిన 'శాంతి దళం'లో సభ్యుడిగా విజయప్రసాద్ తన సేవలను అందించినట్టు తెలిపారు.

కాపుల అభ్యున్నతికి పథకాలను పునఃప్రారంభించాలి

నగరంపాలెం: టీడీపీ ప్రభుత్వం 2014–19లో కాపు, తెలగ, ఉపకులాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలగ అభ్యుదయ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తిని గురువారం వెలగపూడిలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. గతంలో ప్రవేశపెట్టిన పథకాలను పునఃప్రారంభించి, కాపుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కాపు భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కాపుల అభ్యున్నతికి ప్రజాగళం, ఎన్నికల మేనిఫెస్టోలో ఏటా రూ.3 వేల కోట్లు వెచ్చిస్తామనే హామీ అమలు చేస్తారనే నమ్మకం తమలో ఉందన్నారు. ఎండీని కలిసిన వారిలో కోలా చలపతిరావు, రేపల్లె నవీన్, చెమిటికంటి కిరణ్, తుమ్మల నరసింహారావు పాల్గొన్నారు.



జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



భట్టిప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు



చందోలులో కుటుంబ నియంత్రణపై ర్యాలీ చేపడుతున్న ఆరోగ్య సిబ్బంది

భట్టిప్రోలు: జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యులు ఎ. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని గురువారం పురవీధులలో విద్యార్థులతో కలసి వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పాటించాలని, కుటుంబ సంక్షేమం దేశ సౌభాగ్యమని, చిన్న కుటుంబం–చింతలేని కుటుంబం, కాన్పుల మధ్య ఎడం–తల్లిబిడ్డల ఆరోగ్యం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం స్థానిక రథం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందోలు (పిట్టలవానిపాలెం): పరిమితమైన కుటుంబంతో అపరిమితమైన ఆనందంతో జీవించవచ్చని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చంద్రిక తెలిపారు. మండలంలోని చందోలు గ్రామంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావాలని సూచించారు. మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు నిండే వరకు వివాహం చేయరాదని తెలిపారు. కాన్పుకు, కాన్పుకు మధ్య ఎడం పాటించడం, కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంబించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని అప్పుడే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'వివాహానికి ఎందుకు తొందర..చదువుకో ముందర, ఒక కుటుంబానికి ఒకరు లేక ఇద్దరు పిల్లలు చాలు' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నరసింహారావు, జానీ, నాగమణి, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీట్ పునఃనిర్వహణ.. విద్యార్థులకు శిక్ష

లక్ష్మీపురం: నీట్ ప్రశ్న పత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించడం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరిని ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి రక్షించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో నష్ట పోయిన విద్యార్థులకు రీ–టెస్ట్‌కి చివరి అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వెల్లడించిందన్నారు. అయితే ఇది చివరి ఆప్షన్ మాత్రమేనని పేర్కొందన్నారు. రెండు మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినప్పుడు 23 లక్షల మందికి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పూ చేయని వారికి శిక్షేనని, దీనిపై పునరాలోచించాలనని కోరారు. పి.భావన్నారాయణ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సంస్థ సభ్యులు మాట్లాడారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ మల్లేశ్వరరావు

సమాజ సేవలోనూ ముందుండాలి

ఘనంగా బీ ఫార్మసీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే

గుంటూరు ఎడ్యుకేషన్: బీ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి సమాజ సేవ చేయాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పీజీఈ సెట్, జీ ప్యాట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బీ ఫార్మసీ విద్యార్థులు ఎం ఫార్మసీ చదవడం ద్వారా ఔషధ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు బహుళ జాతి ఔషధ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, పర్యావరణ వేత్త డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలిగి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా విన్నప్పుడు విజయం సాధ్యమవుతుందని వివరించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, ప్రణాళికతో ప్రతి సబ్జెక్ట్‌ను ఉపాధ్యాయుని ద్వారా రాబట్టుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. జోజప్ప, పి. బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా విద్యార్థులు ప్రయత్నించాలని కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. 10, 12 తరగతుల పరీక్ష ఫలితాలు అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన సభను గురువారం జగ్గడిగుంటపాలెంలోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. కేంద్రియ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ తమ పాఠశాలకు ప్రశాంస పత్రాన్ని అందించినట్లు వివరించారు. అనంతరం సత్తెనపల్లిలో 8,9 తేదీల్లో జరిగిన అండర్ –14 విభాగ బాలుర ప్రాంతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన పాఠశాల జట్టును అభినందించారు. అలాగే నిర్వాహకులు అందజేసిన ట్రోఫీని జట్టు సభ్యులకు అందజేశారు. రానున్న రోజుల్లో జట్టు జాతీయ స్థాయిలో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ బి.రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకున్న వాలీబాల్ క్రీడాకారులు

ముప్పయ్ వేలిచ్చి.. రెండున్నర లక్షలు కాజేశారు!

తెనాలిరూరల్: ఆన్‌లైన్‌లో సినిమాలు, ఇతర ఉత్పత్తులు, హోటళ్లకు రేటింగ్ ఇస్తే నగదు ఇస్తామంటూ వచ్చిన టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేసి మహిళ సుమారు రూ. 2.53 లక్షలు మోసపోయింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల గ్రామం కఠెవరంకు చెందిన తుమ్మల రేణుకకు టెలిగ్రామ్ యాప్‌లో గుర్తు తెలియని నంబరు నుంచి లింక్ వచ్చింది. అది క్లిక్ చేయగా ఆన్‌లైన్‌లో సినిమాలు, హోటళ్ల ఇతర ఉత్పత్తులకు రేటింగ్ ఇవ్వాలని ఇందుకు వేలల్లో నగదు పొందవచ్చని సమాచారం ఉంది. లింక్‌లో సూచించిన విధంగా రేటింగ్ ఇవ్వగా రూ. 30 వేలు రేణుక ఖాతాలో జమ అయ్యింది. దీంతో లింక్‌ను పంపిన వారిని నమ్మిన ఆమె తరచూ రేటింగ్ ఇస్తూ ఉంది. యాప్‌లో సూచించిన విధంగా మూడు దఫాల్లో రూ. 2.53 లక్షలు చెల్లించింది. అప్పటి నుంచి లింక్ పని చేయకుండా పోవడం, సదరు నంబరు నుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. సైబర్ క్రైం కింద కేసును నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.